
# వన్‌సైడ్ వేలానికి కుమ్మక్కు!

- బోయకొండలో సజావుగా వేలం టెండర్లు జరిగేనా?
- నేటి నుంచి మూడు రోజుల పాటు వేలం పాటలు
- ఏకపక్షంగా టెండర్లు దక్కించుకోవాలని కూటమి కుట్రలు
- సిండికేట్‌గా మారి ఆలయ ఆదాయానికి గండి


బోయకొండ గంగమ్మ ఆలయం

**సాక్షి టాస్క్‌ఫోర్సు:** బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద వివిధ హక్కుల నిర్వహణ కోసం ఏడాది పాటు గడువునిస్తూ బహిరంగ వేలం పాటలు, టెండర్ల ద్వారా గుత్తేదారులకు ఆయా హక్కులపై లీజు కివ్వడం తెలిసిందే. గత ఏడాది బోయకొండలో జరిగిన వివిధ హక్కుల వేలం పాటల ద్వారా ఆలయానికి రూ.5.39 కోట్ల ఆదాయం సమకూరింది. ఈక్రమంలో ఈనెల 10వ తేదీ సోమవారం నుంచి మూడు రోజులపాటు బోయకొండ ఆలయ పరిపాలన కార్యాలయంలో బహిరంగ వేలం పాటలు, టెండర్లను అధికారులు నిర్వహించడానికి చర్యలు తీసుకున్నారు. బోయకొండలో జరిగే వేలం పాటలకు ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి వ్యాపారస్తులు వచ్చి నిర్ణయించిన ధరావత్తును చెల్లించి వేలం, టెండర్లలో పోటాపోటీగా పాల్గొనేవారు. దీనివల్ల ఆలయ ఆదాయం పెరగడానికి దోహదపడేవారు. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బోయకొండలో ఇందుకు పరిస్థితి భిన్నంగా మారిందనడానికి చాలా ఘటనలు చోటుచేసుకున్నాయి. గత ఏడాది వివిధ హక్కులపై బహిరంగ వేలంలో లక్షలాది రూపాయలు చెల్లించి పోటాపోటీగా వేలంలో పాల్గొని సొంతం చేసుకొన్న వ్యాపారులకు, గుత్తేదారులకు చేదు అనుభవాలు ఎదురయ్యాయి. కూటమి నాయకులు బలవంతంగా వేలం పాటదారుల నుంచి దౌర్జన్యంగా లాక్కొని వారే నిర్వహించుకుని లక్షలు ఆర్జించారు. ఇంత జరిగినా అధికారులు, పోలీసులు బాధితులకు ఎలాంటి సహకారం అందివలేకపోయారనే ఆరోపణలున్నాయి. తిరిగి ప్రశ్నించిన వారిపై దాడులు, కేసులు పెట్టారు. కొందరు న్యాయ స్థానాలను ఆశ్రయించిన విషయం తెలిసిందే. వేలంలో పోటీ పెరిగితే ఆదాయం రెట్టింపు అవుతుంది. వేలం పాటదారులు ముందుకు రాకుండా చేసి ఏకపక్షంగా అన్ని వేలం పాటలు, టెండర్లు తమ మద్దతుదారులకే కట్టబెట్టాలని కూటమి నేతలు చూస్తున్నారని చర్చ సాగుతోంది. కూటమిలో ఓ వర్గం వారికే ప్రాధాన్యత ఇచ్చి బోయకొండలో ఇటీవల దౌర్జన్యంగా వేలం పాటలు, టెండర్లను లాక్కొని అనుభవిస్తున్న నాయకులకే మళ్లీ వారికే దక్కేలా చేయాలని ప్రయత్నాలు సాగుతున్నాయి. వేలం పాటలకు బయట వ్యక్తులు, రాకుండా భయభ్రాంతులకు గురిచేసి ఆలయ సొమ్ము అప్పలంగా మేసేలా పథకం రచించారని, వారికి ఆలయంలో ఉన్నత స్థాయి అధికారి సైతం అండగా ఉన్నారని, ఆరోపణలు చేశారు. గతంలోకంటే ఈసారి ఆలయ ఆదాయం తగ్గితే తాను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని ఇటీవల టీడీపీ నాయకుడు, బోయకొండ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎస్‌కే. రమణారెడ్డి మీడియాకు చెప్పడం గమనార్హం. కూటమి నేతల్లోనే బోయకొండ వేలం పాటల్లో దోచేయాలని చూస్తున్నారని ఓ వర్గం నేతలు బహిరంగంగా చెబుతున్నారు. ఈఘటనపై అధికారులు ఆలయ ఆదాయాన్ని రెట్టింపుచేస్తారా లేదా కూటమి నేతలతో కుమ్మకై ఆదాయానికి గండి కొడతారా వేచి చూడాల్సి ఉంది.

**పోలీసుల భద్రత పటిష్టమేనా....?**

వేలం పాటల్లో మూడు రోజులపాటు బోయకొండలో ఉత్కంఠ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారులను స్థానిక కూటమి నేతలు భయభ్రాంతులకు గురిచేసే అవకాశం ఉంది. పోలీసులు వేలం పాటలు, టెండర్లు సజావుగా సాగేందుకు భద్రత కల్పిస్తారా లేదా వారికే వత్తాను పలుకుతారా అంటూ కూడా చర్చ కొనసాగుతోంది. ఏది ఏమైనప్పటికీ పోలీసుల భద్రత ఎలా ఉండబోతోందో చూడాల్సి ఉంది.

## దరఖాస్తు చేసుకోండి

**పుంగనూరు:** పుంగనూరు డివిజన్ పరిధిలోని రైతులకు సబ్సిడీ ధరపై వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేయనున్నట్లు ఏడీ శివకుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, పెద్దపంజాణి, గంగవరం మండలాల్లోని రైతులు వ్యవసాయ పనిముట్ల కోసం ఈనెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు రూ.68.98 లక్షలు కేటాయించారన్నారు. ఇందులో 17 శాతం ఎస్సీ రైతులకు, 7 శాతం ఎస్టీలకు కేటాయించారన్నారు. 8 మండలాల్లో గతంలో సబ్సిడీలు పొందిన రైతులు అర్హులు కాదన్నారు. ఒక ట్రాక్టర్, 146 స్ప్రేయర్లు, 186 యంత్రాలతో లాగే పనిముట్లు, 8 రొటావేటర్లు, 2 పవర్‌విడర్స్, ఒక బ్రస్‌కట్టర్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పంట నమోదు చేసుకున్న రైతులు తమ ఆధార్, పాసుపుస్తకం, రికార్డులతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. 50 శాతం సబ్సిడీతో ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. 50 శాతం సబ్సిడీ నగదును రైతు సేవా కేంద్రాల వద్ద డిజిటల్ పేమెంట్లు చేసి, రశీదు పొందాలన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## భగవద్గీతపై ప్రచారం

**యాదమరి(కాణిపాకం):** యాదమరి మండలంలోని వరదరాజులపల్లెలో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు భగవద్గీతపై ఇంటింటా ప్రచారం చేశారు. పండుగలపై అవగాహన కల్పించారు. భగవద్గీత పఠనంపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సభ్యులు ధనుంజయ్య మునిరత్నం, సరళాదేవి పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారుల ఇక్కట్లు

**సదుం:** మండల కేంద్రంలో బీఎస్‌ఎన్‌ఎల్ సెల్‌ఫోన్ వినియోగదారులు ఆదివారం నెట్‌వర్క్ పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కూడా సిగ్నల్స్ లేకపోవడంతో ఫోన్ వినియోగించలేకపోయారు. ఎవరికి ఫిర్యాదు చేయాలో కూడా తెలియక అవస్థలు పడ్డారు. ప్రైవేట్ నెట్‌వర్క్‌లు మెరుగైన సేవలతో వినియోగదారులను ఆకట్టుకుంటూ ఉంటే..మొక్కుబడి సేవలతో ఉన్న వినియోగదారులను బీఎస్‌ఎన్‌ఎల్ పోగొట్టుకుంటోందని పలువురు అసహనం వ్యక్తం చేశారు. ఇకనైనా సంబంధిత సిబ్బంది చొరవ చూపి మెరుగైన సేవలు అందించేలా చూడాలని వినియోగదారులు కోరారు.

### మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి


మహిళా ఉద్యోగులకు సన్మానం

**పలమనేరు:** మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని గాండ్ల కుల ఉపాధ్యాయ సంఘ నాయకులు వాటాటి హరిక్రిష్ణ తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్‌జీఓ హోంలో ఆదివారం గాండ్ల కులంలోని మహిళా ఉద్యోగులకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు గాండ్ల కులానికి చెందిన ఉద్యోగినులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో సంఘ నేతలు హేమావతి, గిరిశ్రీనివాస్, హేమాద్రి, అమరేంద్ర బాబు, కుమారి, చౌడప్ప, టీకే షణ్ముగం, కోదండరామయ్య పాల్గొన్నారు.

### సద్వినియోగం చేసుకోండి

**రొంపిచెర్ల:** పశు బీమా పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్ అన్నారు. అయన ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ రైతులకు 80 శాతం, బీసీ, ఓసీలకు 50 శాతం రాయితీ ఇస్తుందన్నారు. ఒక రైతు ఐదు పశువులకు బీమా చేసుకోవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీలు ఒక పాడి ఆవుకు రూ.384 చెల్లిస్తే చాలన్నారు. బీసీ, ఓసీలు రూ.960 చెల్లించాలన్నారు. బీమా కాల పరిమితి మూడేళ్లు ఉంటుందని తెలిపారు. అకాల మరణాలతో ఆవులు, గేదెలు చనిపోతే వయస్సును బట్టి రూ.15వేల నుంచి రూ.30వేల వరకు పరిహారం వస్తుందని పేర్కొన్నారు. వివరాల కోసం రైతు సేవా కేంద్రాల్లో పశు వైద్య సిబ్బందిని సంప్రదించాలని ఆయన సూచించారు.

### కంటి ఆపరేషన్లకు 20 మంది ఎంపిక


కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ మురళీక్రిష్ణ

**బైరెడ్డిపల్లె:** మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ వారి సహకారంతో బైరెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో చెన్నై శంకరనేత్రాలయ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 52 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 20 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఉచితంగా బస్సు సౌకర్యంతో పాటు భోజనం, వసతి, మందులు అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు. వైద్యాధికారులు మురళీక్రిష్ణ, శ్రీనివాసులు, రమణ, గంగాధరం పాల్గొన్నారు.

### ఆత్మ ఆరాధనతోనే మోక్షం సాధ్యం

**కుప్పం రూరల్:** ఆత్మను ఆరాధించడంతోనే మోక్షం సాధ్యమని ప్రబోధానంద సేవా సమితి కుప్పం ప్రతినిధి కృష్ణ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని డి.కె.పల్లిలో ప్రబోధానంద రచనలపై ప్రచారం నిర్వహించారు. కృష్ణ మాట్లాడుతూ జీవునిలో జీవాత్మ, ఆత్మ, పరమాత్మ ఉంటుందన్నారు. ఇందులో మధ్యదైన ఆత్మను ఆరాధించడంతోనే మోక్షం సాధ్యమని ప్రబోధానంద రచనల్లో తెలియజేస్తుందన్నారు. హిందూ ధర్మ పరిరక్షణకు స్వామి ప్రబోధానంద అనేక రచనలు చేశారని, వీటిలో ఎంతో జ్ఞానం పొందుపరచినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు ప్రకాశ్, శివకృష్ణ, కృష్ణమూర్తి, శరవణ, దేవరాజు, రాజ్‌కుమార్, చరణ్, వెంకటలక్ష్మీ, మైత్రి ఉన్నారు.

### 23న తిరుపతిలో మాలల సింహగర్జన

**చిత్తూర రూరల్ (కాణిపాకం):** ఎస్సీ వర్గీకరణ నిలిపి వేయాలని డిమాండ్‌చేస్తూ ఈ నెల 23న మాలల సింహగర్జన నిర్వహించనున్నట్లు పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు పిలుపునిచ్చారు. చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో ఆదివారం మాలల సింహగర్జనపై సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తిరుపతిలో ఈనెల 23న రాయలసీమ మాలల సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గుడిపాల మండల కన్వీనర్ ప్రకాష్, మాల నాయకులు సుదర్శన్, రవి, ప్రభాకర్, పరదేశి పాల్గొన్నారు.

## సింహవాహనంపై ఊరేగిన శ్రీవారు


సింహవాహనంపై విహరిస్తున్న శ్రీవారు

**పుంగనూరు:** పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీవారిని సింహవాహనంపై ఊరేగించారు. రాత్రి ముత్యపుపందిరి వాహనంపై శ్రీవారు ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తుల గోవిందనామస్మరణలతో భజనలు నిర్వహించారు.

## తాగునీటి సమస్యలకు ప్రాధాన్యం

**కుప్పం:** వేసవి కాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీపీ అశ్విని తెలిపారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు పడకపోవడంతో నీటి సమస్య ఏర్పడే అవకాశాలు ఉన్నాయని, అధికారులు ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా పాలన సాగించాలని ఆమె కోరారు. సచివాలయాల్లో అధికారులు ప్రజలకు అందుబాటుల్లో ఉండాలని కోరారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో వేసవిలో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎంపీడీఓ విజయ్ పథ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్ చేరిన టెన్త్ ప్రశ్నపత్రాలు


పోలీస్‌స్టేషన్‌కు చేరిన ప్రశ్నపత్రాలు

**పలమనేరు:** పదో తరగతి ప్రశ్నపత్రాలు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. ఈసందర్భంగా సెట్ -2 ప్రశ్నాపత్రాలను రూట్ ఆఫీసర్, బంగారుపాళెం ఎంఈఓ నాగేశ్వరావు ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేర్చారు. ఈనెల 17నుంచి 31 దాకా పరీక్షలు జరగనున్నాయి. మండలంలోని 8 సెంటర్లలో 1,327మంది పరీక్షలకు హాజరుకానున్నట్టు తెలిపారు.

## 16న స్వయంసేవక్ సమావేశం

**పుంగనూరు:** పట్టణంలోని ట్రావెలర్స్ బంగ్లాలో ఈనెల 16న మధ్యాహ్నం 3 గంటలకు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రతినిధులు త్రిమూర్తిరెడ్డి, గణేష్, రవీంద్రనాథ్ తెలిపారు. ఈమేరకు ఆదివారం వారు మాట్లాడుతూ కలిసి అడుగులు వేద్దాం.. కలిసి పదం పలుకుదాం..కలిసి ఆలోచిద్దాం అనే నినాదాలతో ఏర్పాటైన సంఘ్ శతవసంతాలలో అడుగిడుతున్న సందర్భంగా ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘ ప్యాంటు, పొడుగు చేతుల తెల్లచొక్కా, పట్టాటోపి, దండం తీసుకుని రావాలని సూచించారు.

## విద్యార్థినుల సరస్వతీ పూజ


పూజ అనంతరం విద్యార్థినులతో టీచర్లు

**పుంగనూరు:** పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో హెచ్‌ఎం రుద్రాణి ఆధ్వర్యంలో బాలికలు పరీక్షలు బాగా రాయాలని సరస్వతీదేవికి పూజలు చేశారు. ఈసందర్భంగా పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. విద్యార్థినుల పూలతో ముగ్గులు వేసి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్కూల్ చైర్మన్ వాణి, వైస్‌చైర్మన్ బాబు, సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జోరుగా సారా తయారీ

- విచ్చలవిడిగా అమ్మకాలు
- ప్యాకెట్ రూ.30 మాత్రమే
- మద్యం మత్తులో యువకులు

**చౌడేపల్లె:** గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా సారా ఏరులైపారుతోంది. సారా తయారీ, విక్రయాలు జోరుగా సాగుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంతో అధికారుల తీరుపై సర్వత్రా ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. సారా రహిత గ్రామాలను ఏర్పాటు చేస్తామని గొప్పలు చెబుతూ ప్రకటనలిచ్చారే కానీ ఎక్కడా అమలు కావడంలేదు. అధికారులు, రాజకీయ నేతల అండతో దర్జాగా వ్యాపారం సాగిస్తున్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో సారా చిచ్చుతో నిత్యం ఘర్షణలు, చోరీలు జరుగుతున్నాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా మద్యం ప్రియులు మత్తులో జోగుతున్నారు. తక్కువ ధరలకు కావాల్సినంత కిక్కు ఎక్కుతుండడంతో మద్యం ప్రియులు సారా వైపు మొగ్గుచూపుతున్నారు. మండలంలోని దుర్గసముద్రం, బండమీదపల్లె, గాజులవారిపల్లె, బోయకొండ గంగాపురం, ఊటూరు, కాగతి, కాటిపేరి, భవానీనగర్, లక్ష్మీపురం, శికారిపాళెం, పక్షిరాజపురం కొలింపల్లె, పరికిదొన, మదుకూరు, కోటూరు పరిసర ప్రాంతాల్లో సారా వ్యాపారం జోరుగా సాగుతోంది. వ్యాపారులు సారాను ప్యాకెట్లుగా చేసి, ఒక్కొక్క ప్యాకెట్ రూ.30 నుంచి రూ.40 వరకు విక్రయిస్తున్నారు. పది కొన్న వారికి రెండు ప్యాకెట్లు ఉచితంగా ఇస్తున్నట్లు సమాచారం ఎక్సైజ్ పోలీసులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


దుర్గసముద్రం అటవీ ప్రాంతంలో తయారు చేస్తున్న సారా




కుప్పం- కృష్ణగిరి జాతీయ రహదారిలో నడుమూరు మోడల్ స్కూల్‌కు సమీపంలో ఓ మలుపు ప్రమాదకరంగా మారింది. ఈ మలుపును బాగు చేయాలని వాహన చోదకులు చాలారోజులుగా కోరుతున్నారు. ఈ ప్రాంతంలో వారంలో రెండు ప్రమాదాలైనా చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాల్లో మనుషులు ఆస్పత్రి పాలవడమే కాకుండా మరోవైపు వాహనాలు కూడా దెబ్బతింటున్నాయి. ఒక్కోమారు ప్రమాదాలు జరిగి వాహనాలు రోడ్డుకు అడ్డంగా పడితే ట్రాఫిక్ సమస్యలు కూడా తలెత్తిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అధికారులు స్పందించి ఈ ప్రమాదకర మలుపును సరిచేసి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు. -కుప్పం రూరల్

## రైతుల మేలే ప్రభుత్వ లక్ష్యం

- రైతుబజార్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

**పలమనేరు:** రైతులకు మేలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి తెలిపారు. ఆమేరకు పట్టణంలో స్థానిక మార్కెట్‌కమిటీ సాయంతో రూ.26లక్షల వ్యయంతో నిర్మించిన రైతుబజార్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలు దళారులు, గేటు లేకుండా పంట ఉత్పత్తులను ఇక్కడ అమ్ముకుంటారన్నారు. రైతులు, రైతు సంఘాలు, మహిళా గ్రూపుసభ్యులు ఇందులో వారు పండించిన పంట ఉత్పత్తులను ఇక్కడ విక్రయించుకోవచ్చునని తెలిపారు. జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ పరమేశ్వరన్, స్థానిక మార్కెట్ కమిటీ కార్యదర్శి సంజీవ్‌కుమార్, నేతలు రామన్న, బాలాజీ పాల్గొన్నారు.


రైతుబజార్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

### తాగునీటి సమస్య పరిష్కారం

**బైరెడ్డిపల్లె:** మండలంలోని కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలలో రెండు నెలలుగా తాగునీటి సమస్య నెలకొనడంతో ఉపాధ్యాయులు ఎమ్మెల్యే ఎన్.అమరనాథరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన స్పందించి విద్యార్థుల తాగునీటి సమస్య పరిష్కారం కోసం నూతనంగా బోరు వేసి మోటారు అమర్చారు. ఆదివారం తాగునీటి బోరును ప్రారంభించి విద్యార్థుల తాగునీటి సమస్యకు పరిష్కారం చూపారు.

## నేడు కల్పవృక్ష, హనుమంత వాహన సేవ

**పుంగనూరు:** పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వార్షిక బ్రహ్మోత్సవ సేవలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి హనుమంత వాహనంపై శ్రీవారిని ఊరేగిస్తామన్నారు.

**మహిళా దినోత్సవం**

**సదుం:** మండలంలోని అమ్మగారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10. 30 గంటలకు మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు సూపర్‌వైజర్ మల్లీశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు.

## పంటలకు రక్షణగా చీరలు

**పలమనేరు:** మండలంలో ఇటీవల కూరగాయల సాగు ఎక్కువైంది. రైతులు పండించిన పంటలకు చీడ పీడలు సోకకుండా, తెగుళ్లు రాకుండా పొలం చుట్టూ ఇప్పుడు పాత చీరలను కట్టడం ఎక్కువైంది. సాధారణంగా మెస్ కట్టాలంటే వేల రూపాయల ఖర్చు కాబట్టి పాత చీరలను పంటకు రక్షణగా వాడుకుంటున్నారు. ఆమేరకు మండలంలోని సాకేవూరు వద్ద ఓ రైతు మొక్కజొన్న పంటకు రక్షణగా వినూత్నంగా ఆలోచించి ఈ పని చేశారు. దీన్ని గమనించిన పలువురు రైతులు ఇప్పుడు పంటకు పాయ చీరలను కడుతున్నారు.


సాకేవూరు వద్ద పంటకు కట్టిన పాత చీరలు

# పెద్ద దేవరకు నేడు అంకురార్పణ

- తొమ్మిదేళ్ల తర్వాత ఉత్సవాలు

**శాంతిపురం:** కొలమడుగు పంచాయతీలోని కదిరిముత్తనపల్లిలో ఐదు రూపాల్లో దర్శనమిస్తున్న మహాదేవుడికి ఐదు రోజుల పెద్దదేవర (బ్రహ్మోత్సవాలు)కు సోమవారం అంకురార్పణ చేయనున్నారు. కురబ కులస్తులు అత్యంత పవిత్రంగా భావించే ఈ ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నలభై గోత్రాలకు చెందిన 1,500 కురబ కుటుంబాల వారు నిష్టతో మూడు రోజులు పూజల్లో పాల్గొంటారు. ఐదు లక్షల మందికి పైగా భక్తులు హాజరవుతారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

**ఇదీ చరిత్ర**

130 ఏళ్ల క్రితం వుండగౌడు అనే కురబ కుల పెద్ద హయాంలో కదిరిముత్తనపల్లి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికీ ఆయన వంశస్థుడైన మునిరత్నంగౌడు ధర్మకర్తగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శ్రీసిద్ధేశ్వరస్వామి, శ్రీభీరేశ్వరస్వామి, శ్రీరేవణ్ణ సిద్ధేశ్వరస్వామి, శ్రీబత్తేశ్వరస్వామి, శ్రీచెన్నకేశ్వరస్వామి ఇక్కడ పూజలు అందుకుంటున్నారు. సాధారణంగా లింగాకారుడిగా దర్శనమిచ్చే శివయ్య ఇక్కడ మాత్రం ఐదు విగ్రహాల రూపంలో భక్తులకు కనువిందు చేస్తున్నాడు. వివిధ ప్రాంతాల్లోని ఆలయాల్లో నిత్య పూజలు కరువైన తమ ఇలవేల్పులను ఒక చోటికి చేర్చి కురబ కులస్తులు నిత్య పూజలు, ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. సంతూరు సమీపంలోని శ్రీసిద్ధేశ్వరస్వామి, మఠంలోని శ్రీభీరేశ్వరస్వామి, బడుగుమాకులపల్లి వద్ద ఉన్న శ్రీబత్తేశ్వరస్వామి, రామకుప్పం మండలంలోని ఆనిగానూరు నుంచి శ్రీచెన్నకేశ్వరస్వామి, కుర్లపల్లి నుంచి శ్రీరేవణ సిద్ధేశ్వరస్వామి వివిధ సందర్భాల్లో ఇక్కడికి చేరారు. ఈ ఐదుగురు మూర్తులను పూజించే కురబలు దేవరలను సమష్టిగా చేస్తుండడంతో వేలాది కుటుంబాలు ఒకే చోటికి చేరి స్వామివారిని కొలుస్తారు.



కదిరిముత్తనపల్లిలో పూజలందుకుటున్న శివరూపాలు, ఐదు రూపాల శివయ్య ఆలయంలో ఓ భాగం

**నియమాల హారం**

పెద్దదేవర నిర్వహణపై కుల పెద్దలు నిర్ణయించిన తర్వాత 45 రోజులు ముందుగా తమ గోత్రాల వారు ఉన్న అన్ని గ్రామాలకూ వెళ్లి వారికి బొట్టు పెట్టి ఉత్సవాల విషయం తెలియజేస్తారు. ఉత్సవాల సమాచారం అందిన నాటి నుంచి క్రతువు ముగిసేంత వరకూ ఇంటిల్లిపాది మాంసాహారానికి దూరంగా ఉంటారు. ఇళ్లను శుద్ధి చేసి సున్నం, రంగులు వేశాకగానీ ఇతరులను ఇంట్లోకి రానివ్వరు. బ్రహ్మోత్సవాల సందర్భంగా తమ ఆడపడుచులకు కంచు తట్టతో సారెలు, వారి కుటుంబ సభ్యులందరికీ కొత్త బట్టలు పెడతారు. ఆలయ సమీపంలో గుడారాలు ఏర్పాటు చేసుకుని మూడు రోజులపాటు నిత్య పూజల్లో పాల్గొంటారు. దేవరకు ప్రతి కుటుంబం రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకూ ఖర్చు చేస్తుంది.

**ఉత్సవాలు ఇలా..**

సోమవారం అంకురార్పణతో కదిరిముత్తనపల్లి ఉత్సవాలు ఆరంభం అవుతాయి. తొలి రోజు గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, ధ్వజారోహణం, అభిషేకం నిర్వహిస్తారు. మంగళవారం కలశస్థాపన, వాస్తు హోమం, గణపతి హోమం, గాయత్రీ హోమం చేస్తారు. 12న రుద్రాభిషేకం, రథోత్సవం, కోలాటాలు జరుగుతాయి. 13న తవుటమొద్దు పూజ, పంచామృతాభిషేకం, వృషభ వాహనోత్సవం ఉంటాయి. 14న తలలపై కొబ్బరికాయలు కొట్టే కార్యక్రమం, కోలాటగాళ్ల డాన్సులు, జయాధి హోమం, దీపారాధన జరుగుతాయి. 15న శాంతి పౌష్టిక హోమం, వసంత ఉత్సవం, పుణ్య జ్యోతి, మహా మంగళహారతి కార్యక్రమంతో ఉత్సవాలు వేడుకగా ముగుస్తాయి. 13, 14వ తేదీల్లో భక్తులు, సందర్శకుల తాకిడి అధికంగా ఉంటుంది.